క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు. రక్షాపురం విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

సిటీ సివిల్ కోర్టులో యోగా డే



యాకుత్‌పురా: అంతర్జాతీయా యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం పురాణిహవేలిలోని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో జడ్జిలు పాల్గొన్నారు. న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.వి.సుబ్బయ్య, ఉద్యోగులు పాల్గొని యోగాసనాలు చేశారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



అశోక్‌బజార్‌లో రథయాత్ర

అబిడ్స్: జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. అశోక్‌బజార్‌లో ప్రారంభమై గౌలిగూడ, సిద్ది అంబర్ బజార్, బేగంబజార్ ప్రాంతాల్లో సాగింది. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ గోషామహల్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, పూజవ్యాస్ బిలాల్‌లు ప్రత్యేక పూజలు చేశారు. రథయాత్ర సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

సన్మానం



పాల్గొన్న చైర్మన్, న్యాయవాదులు

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ ట్రిబునల్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను వక్ఫ్ ట్రిబునల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇలియాస్ ఆధ్వర్యంలో బుధవారం పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టు వక్ఫ్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎజాజ్ అలీ ఖురేషితో పాటు న్యాయవాదులు ఇద్రీస్, ముబీన్, ఇఫ్తేకార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

యాకుత్‌పురా: తెలంగాణ సిద్ధాంతకర్త దివంగత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి రఘువీరారెడ్డి, స్పెషల్ జీపీ తిరుమల్ రావు, స్టాండింగ్ కౌన్సిల్ అజయ్ కుమార్, ఏజీపీ చక్రాధర్, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నలుగురిపై కత్తులతో దాడి

జియాగూడ: చిరు ఘర్షణ కత్తులతో దాడికి దారి తీసిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... వాల్మీకినగర్‌బస్తీలో శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటి అరుగుపై కూర్చొని మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి పక్కనే ఉండే ఇద్దరు యువకులు ఘర్షణ పడి శ్రీనివాస్‌పై చేయి చేసుకున్నారు. దీంతో తనపై చేయి చేసుకున్న వారిపై శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఇద్దరు యువకులు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మరో పదిమందిని వెంట పెట్టుకొని శ్రీనివాస్ కుటుంబానికి చెందిన నలుగురిపై కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులకు గాయపడ్డ వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి కోట బోనాలు

ఏర్పాట్లు పూర్తి

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. కోటలో కొలువుదీరిన శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల ఆషాఢ మాస బోనాల నేపథ్యంలో జలమండలి, బల్దియాతో పాటు దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ వారు కోటలో వైద్య బృందంతో పాటు అంబులెన్స్ సిద్ధం చేశారు. కోటలో అడుగడుగునా ఉచిత తాగునీటి క్యాంపులు ఏర్పాటు చేశారు. ఫతే దర్వాజా నుంచి కోట చౌరస్తా వరకు ఉన్న రోడ్డుపై చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు చోటాబజార్, బడాబజార్ వ్యాపారులతో కలిసి బోనాల ఊరేగింపు శాంతియుతంగా ముగిసేందుకు సహకారం అందించాలన్నారు. బంజారా దర్వాజ, బడాబజార్, గోల్కొండ మెయిన్ గేటు, నగీనాబాగ్ తదితర ప్రాంతాలలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కేంద్ర పురాతత్వశాఖ వారు బోనాల ఉత్సవాలు జరిగే రోజుల్లో కోటలో ఉచిత ప్రవేశం కల్పిస్తామని ప్రకటించారు. పూజా ఏర్పాట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో జరుగుతున్నాయి.



కోటలో కొలువుదీన అమ్మవారు

బోనాలు జరిగే తేదీలు

జూన్ 22న మొదటి పూజ, 25న ఆదివారం 2వ పూజ, జూన్ 29 గురువారం 3వ పూజ ఉంటుంది. జూలై 2 ఆదివారం 4వ పూజ, 5వ పూజ గురువారం జూలై 6, 6వ పూజ జూలై 9వ ఆదివారం, 7వ పూజ జూలై 13 గురువారం రోజు నిర్వహిస్తారు. 8వ పూజ జూలై 16 ఆదివారం రోజున, చివరి పూజ జూలై 20వ తేదీతో ముగుస్తుంది.

మోదీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గౌలిపురా: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ శాసనసభ్యుడు ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు. గౌలిపురా డివిజన్‌లోని ఆరె కటిక భవనంలో మంగళవారం రాత్రి యాకుత్‌పురా అసెంబ్లీ బీజేపీ సీనియర్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... మూడు దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకులను ఏకతాటిపైకి తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. మాజీ శాసనసభ్యులు ఎండల లక్ష్మీనారాయణ, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, సీనియర్ నాయకులు ఆదర్ల మహేశ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ గౌలీకర్ ధీరజ్‌లాల్, జిల్లా పదాధికారులు వీరేందర్ బాబు, రూప్‌రాజ్, నిరంజన్ యాదవ్, సుమన్, వెంకటేశ్, శివ చంద్రగిరి, కామాటి మహేశ్, జమాల్‌పూర్ అశోక్, కె.సురేందర్, డొంకి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం

చాంద్రాయణగుట్ట: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జుర్కీ సంతోషిరాణి, సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రవి, ఉమారాణి, మీనాక్షి, చంద్రశేఖర్, అర్చనలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ కాంటెస్టెట్ ఎంపీ పుస్తె శ్రీకాంత్, నాయకులు జుర్కీ రాజేందర్, ఆకుల శ్రీనివాస్, ఫెరోజ్, గౌస్, ప్రవీన్, శేఖర్ రెడ్డి, పల్లవి, సరిత, పవన్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

యాకుత్‌పురా: బస్తీల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అన్నారు. రెయిన్‌బజార్ డివిజన్‌లోని మదీనానగర్, వాహేద్‌కాలనీ, ధోబీఘాట్, ఎస్ఆర్టీ కాలనీ ప్రాంతాల్లో కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలసి పాదయాత్ర నిర్వహించారు. రెయిన్‌బజార్‌లో నూతనంగా చేపట్టానున్న డ్రైనేజ్ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని ప్రాంతాలను ఆభివృద్ధి పరిచేందుకు బస్తీలలో పాదయాత్రలు చేస్తూ వాటి పరిష్కారాన్ని కృషి చేస్తునామన్నారు. ఇందులో భగంగా యాకుత్‌పురా రైల్వే స్టేషన్ నుంచి నాగాబౌలి ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. డ్రైనేజ్, నాలాల విస్తరణ అభివృద్ధి నిర్మాణ పనులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బస్తీలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

సత్తాచాటిన పాతబస్తీ బాక్సర్లు

అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

చార్మినార్: పాతబస్తీకి చెందిన నలుగురు బాక్సర్లు గోల్డ్ మెడల్ సాధించారు. పాతబస్తీలోని హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీ కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తఫా వీరిని అభినందించారు. కొంత కాలంగా హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహమ్మద్ అబ్దుల్ హదీ ఉమైర్ (44–45 కిలోల విభాగంలో), మహమ్మద్ అష్ఫాక్(54–57), కె.సాత్విక్(63–66),హంజా మహమ్మద్ అహ్మద్ (75–80 కిలోల విభాగంలో)లు 5వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తఫా మాట్లాడుతూ... రెండు రోజుల పాటు షేక్‌పేట్ స్టేడియంలో జరిగిన అండర్ 17 స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలలో తమ అకాడమీకి చెందిన నలుగురు బాక్సర్లు గోల్డ్ మెడల్ సాధించారన్నారు. వీరు వచ్చే నెల అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొనడానికి ఎంపిక య్యారన్నారు.



బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన వారితో కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తఫా

మిధానిలో ముగిసిన యోగా వేడుకలు

సంతోష్‌నగర్: మిధానిలో రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. మే 29వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా ఉత్సవ్ 2023ను మూడు భోగ్‌లలో (యోగా ఆసనాలు, చర్చలు, యోగాసన ప్రదర్శన) 'హర్ ఆంగన్ యోగా' అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. మిధాని సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా మార్గదర్శకత్వంలో మిధానిలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.గౌరీ శంకర్ రావు, ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ టి.ముత్తు కుమార్, డౌన్ స్ట్రీమ్ అదనపు జనరల్ మేనేజర్ అనూప్ కుమార్ మండల్, అధికార భాషా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవిచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం వృథా

గోల్కొండ: దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ విమర్శించారు. తెలంగాణ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఈ ఉత్సవాలకు ఆహ్వానించడం లేదన్నారు. సంఘసేవకులకు ఈ దశాబ్ది ఉత్సవాలలో సరైన గౌరవం లభించడం లేదన్నారు. తెలంగాణ బీఆర్ఎస్ వల్లే రాదని, అన్ని పార్టీల వారు రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని బలిదానాలు చేశారన్నారు.

అక్కన్న మాదన్న మహంకాళిని దర్శించుకున్న కాసాని



మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్

యాకుత్‌పురా: హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం 75వ బోనాల వజ్రోత్సవాల సందర్భంగా బుధవారం తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆలయాన్ని సందర్శించి ఉత్సవాల ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాతో సన్మానించారు. బోనాల వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణకు తన వంతు సహాయంగా రూ. 1.50 లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, సలహాదారులు డాక్టర్ ఆవుల భరత్ ప్రకాశ్, కోశాధికారి సతీష్ కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, సభ్యులు శ్రీనివాస్, జోగేందర్ సింగ్, టీడీపీ సీనియర్ నాయకులు ప్రకాశ్ ముదిరాజ్, దుర్గేశ్, రవీందర్ చారి, బి.వై.శ్రీకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

గోల్కొండ: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండ రిసాలబజార్‌కు చెందిన ఈలాట్ షాదాన్ మెరిట్ ఆధారంగా మెడికల్ సీటు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం ఆమె తన కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యేను కలిసింది. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.



మెడిసిన్‌లో సీటు సాధించిన ఈలాట్ షాదాన్‌తో ఎమ్మెల్యే కౌసర్

యోగా.. మంచిదేగా!

- చార్మినార్ వద్ద సందడిగా యోగాసనాలు
- ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా డే
- వాడవాడలా యోగా చేసిన ఔత్సాహికులు
- ప్రత్యేక విన్యాసాలతో సందడి చేసిన విద్యార్థులు



జిఎన్ఏటిఏఎస్‌లో యోగా దినోత్సవం



యోగా చేస్తున్న ఉప్పుగూడ సెయింట్ మరియా పాఠశాల విద్యార్థులు

చార్మినార్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాతబస్తీ పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో చార్మినార్ కట్టడం వద్ద యోగాసనాలు చేశారు. ఉదయం జరిగిన యోగా డే పాతబస్తీకి చెందిన పలువురు బీజేపీ నాయకులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లో...

సంతోష్‌నగర్: డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లోని ఎస్టేట్ మేనేజ్‌మెంట్ (ఆర్అండ్‌డీ) హైదరాబాద్ కార్యాలయ ప్రాంగణంలోని లాన్స్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. యోగా గురువు శంకర్ గౌడ్, ధ్యాన గురువు వెంకట్ రెడ్డి, రమేశ్, చీఫ్ ఇంజనీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మోహీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

అబిడ్స్: యోగాసనాలతోనే మానవుని జీవితం పదిలంగా ఉంటుందని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ రాధారాణి పేర్కొన్నారు. భారతీయ యోగ్ సంస్థాన్ (బీవైఎస్) ఆధ్వర్యంలో యోగా ఇంటర్నేషనల్ డేను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రాధారాణి ముఖ్య అతిథిగా వచ్చి ప్రసంగించారు. బీవైఎస్ తెలంగాణ అధ్యక్షులు సుధీర్ కులకర్ణి, రాష్ట్ర నాయకులు చారి, బీఆర్ఎస్ నాంపల్లి ఇన్‌చార్జ్ మెట్టు వెంకటేష్, సభ్యులు నరేందర్ వాల్మియా, సత్యనారాయణ గురుజీ, మధుసూదన్ గురూజీ, లత పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్: యోగాసనాల ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం కలుగుతుందని వాకర్స్ అసోసియేషన్, భజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. వాకర్స్ అసోసియేషన్, భజరంగ్‌సేనల ఆధ్వర్యంలో కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని ఫిరోజ్‌గాంధీ పార్కులో యోగా డేను నిర్వహించారు. వెంకటేష్ యాదవ్, కృష్ణ, రాజు, ప్రసాద్, వసంత్, విజయ్, భాస్కర్ పాల్గొన్నారు.

జేఎన్ఏఎఫ్ఏయూలో..

విజయనగర్‌కాలనీ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జేఎన్ఏఎఫ్ఏయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్శిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్కొండ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గుడిమల్కాపూర్, కార్వాన్, షేక్‌పేట్ తదితర ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. షేక్‌పేట్‌లోని నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

జియాగూడ: జియాగూడలోని విద్యశ్రీ హైస్కూల్‌లో విద్యార్థులు యోగా ప్రదర్శన చేశారు. సరస్వతీ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు పలు ప్రాంతాల్లో యోగా ర్యాలీ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే, ప్రిన్సిపాల్ సునేత్ర, మహేశ్వరి పాల్గొన్నారు. సబ్జిమండి శ్రీసాయి హైస్కూల్‌లో విద్యార్థులు యోగా ప్రదర్శనలు నిర్వహించారు. కరస్పాండెంట్ ప్రణీత, ప్రిన్సిపాల్ జ్యోతి, కోఆర్డినేటర్ రేణురాధ పాల్గొన్నారు.

సింగరేణి భవన్‌లో...

నాంపల్లి: నిత్యం యోగా ఆచరించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని జీఎం (కోఆర్డినేషన్) ఎం.సురేష్ తెలిపారు. హైదరాబాదు సింగరేణి భవన్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన అంతర్జాతీ యోగా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.వి.రాజేశ్వర రావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజరు ఎస్.భాస్కర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



సింగరేణి భవన్‌లో యోగాసనాలను చేస్తున్న అధికారులు



ఫిరోజ్‌గాంధీ పార్కులో యోగాసనాలు వేస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



చార్మినార్ వద్ద యోగాలో పాల్గొన్న బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేందర్ తదితరులు



బీవైఎస్ యోగా వేడుకల్లో డాక్టర్ రాధారాణి, సుధీర్ కులకర్ణి తదితరులు



యోగాదినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు



యోగా డే ర్యాలీలో సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు



డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లో ఉద్యోగులు, సిబ్బంది

నాన్‌టీచింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని ఓయూ ఎన్టీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. తమకు వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం నిజాం కళాశాల నాన్‌టీచింగ్ ఉద్యోగులు బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి నిజాం కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిజాం కళాశాల ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కుమార్, సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, యూనియన్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు శివశంకర్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అలరించిన ఆదివాసీల 'సంగీత విభావరి'

బహదూర్‌పురా: సాలార్జంగ్ మ్యూజియంలో బుధవారం ఆదివాసీలు వివిధ పురాతన సంగీత వాయిద్యాలతో జానపద గీతాలు ఆలపిస్తూ కచేరీని నిర్వహిస్తూ అబ్బురపరిచారు. మ్యూజియంలో ఆద్య కళ, తెలుగు విశ్వవిద్యాలయం సాలార్జంగ్ మ్యూజియం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసుల సంగీత వాయిద్యాల విభావరిని నిర్వహించారు. తెలంగాణలోని ఆదిలాబాద్ కరీంనగర్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన సంగీత కళాకారులతో ఆదివాసుల సంగీతాన్ని ఆలపిస్తూ అలరించారు. ఆదివాసుల పురాతన సంగీత వాయిద్యాలతో వీనులవిందైన కచేరీని నిర్వహిస్తూ జానపదాలకు అనుగుణంగా వాయిద్యాలతో గిరిజనులు కచేరీలు నిర్వహిస్తూ ఆకట్టుకున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం వాయిద్యాలకు అనుగుణంగా తమ గొంతులను కలుపుతూ సంగీతాన్ని పాడుతూ ఓలలాడించారు. పలకడానికి కూడా కష్టంగా ఉన్నటువంటి పురాతనమైన సంగీత వాయిద్యాలతో గిరిజనులు వారి గ్రామాల్లో జరిగే తంతు కార్యక్రమాలను దేవీదేవతలను పొగడటంతో పాటు గొప్పతనాన్ని పురాతన సంగీత వాయిద్యాలతో ఆలపిస్తూ ఆకట్టుకున్నారు. గిరిజన జానపద గీతాలు ఆలపించిన వివిధ కళాకారులను సాలార్జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్ రెడ్డి, చైర్మన్ కిషన్ రావులతో పాటు ఆద్య కళ ప్రదర్శన నిర్వాహకులు తిరుమలరావులు సంగీత కళాకారులను ఘనంగా సన్మానించారు.